

కథ

వేముగంటి శుక్తిమతి
99081 10937

'నమస్తే తెలంగాణ, ముల్కనూరు ప్రజాగ్రంథాలయం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2022'లో రూ.2 వేల బహుమతి పొందిన కథ.

# బుడుబుక్క

ఎడతెరపి లేకుండ మూడు రోజుల్నుంచి వర్షం కురిసింది. కుంటలు, బావులు, చెరువులు తెప్పరిల్లి నిండినయ్. చెట్లమీద కాకులు రెక్కలు టపటప గొడ్తున్నయ్. సూరుకున్న గూట్లెనుండి తొంగిసూస్తున్నది ఊరబిచ్చుక. గజ్జికుక్క లొటలొట చెవులు కొట్టుకుంట ఉరుకుతంది. చెరువుగట్టెంట మిషన్ కాకతీయ పనులు పూర్తిగయి.. మోడై ముండమోసినట్టున్న ఎండిన చెరువు, జలకళతో నిండు గర్భిణి లెక్క కనిపిస్తా ఉంది.

ఊరి నడిమధ్యన డప్పు చప్పుడు డమడమ మోగుతుంటే.. సావట్ల ఏందో మీటింగుందని జనాన్ని రమ్మని పిల్పు తెల్సి పిల్లలు, పెద్దలు, ముసలి, పడుసు, ఈ కులం ఆ కులం అనకుండా అందరు జేరుకుంటుండ్రు.

ఊరవతల గుడారాలల్ల, గుడిసెలల్ల కాపురముండే ఏ కులం లేని కొన్ని బికారి కుటుంబాలు.. దండలు, సూదులు, పిన్నీసులు, పౌడర్ డబ్బాలు, సవరాలు
అమ్ముకుంటూ
ఊరంతా తిరిగినా..
కొనేటోడు లేక పొట్టగ
డ్సుడు కోసం బిచ్చపోల్లయి
అడుక్కుంటుండ్రు.

తెల్లారక ముందే ఊర్లల్ల సూదికాడి నుండి కుర్చీలు, బెంచీలు, పండుకునే బెడ్లు, బట్టలు, బాతలు, కూలర్లు, ఫ్రిజ్జులు.. ట్రాక్టర్లల్ల, వ్యాన్లల్ల బుర్రబుర్ర వస్తుంటే ఎగబడే జనం.

మాసిన నెత్తిపైన బుట్టల సామాను ఎవడిక్కావాలి!!

చీకి చిక్కిపోయి చినిగిన చొక్కా గుండీలు లేకుండ మొల్తాడు మీద ఆగిన లాగు, మొకం పాలిపోయి కళ్లు కంతల్లకు పోయిన పొల్లగాడు..

''అమ్మా! అయ్యా! ధర్మం సేయండి'' అని ఒక్కొక్కళ్లను బతిలాడుతున్న తల్లి చిటికెనేలు పట్టుకొని.. ఏమైనా పెడతారేమోనని ఆశగ చూస్తుండు.

''దగ్గరికి రాకు. నీ అయ్య జాగీరు మా దగ్గరున్నట్టు మీద మీదబడి అడుక్క తింటున్నవ్'' అని ఒకరంటే..

''ఇస్తే తీస్కోవాలి. లేకుంటే ఊకోవాలి'' అని ఇంకొకళ్లు.

ఒక ముసలి బైరాగి తన గుడారం పక్కన చెట్టుకింద